


# నేల దిగని ఊడ

వేంపల్లి గంగాధర్

మర్రిచెట్టు నీడలోకి వచ్చి తన చేతి సంచిని బండపైన పెట్టినాడు పీరా. నుదుటికి పట్టిన చమట తుడుచుకొని కూర్చోవడానికి వీలుగా కిందపడి వున్న ఎండుటాకుల్ని, చిన్న కొమ్మల్ని తీసి అవతలికి పారేశాడు.

అరికాలితోనే అక్కడున్న మట్టిని సమంగా నెరిపాడు. సంతృప్తిగా చేతి సంచిలోని ఒక్కొక్క పని ముట్టునే బయటకు తీసి కింద పెట్టుకున్నాడు.

“ఏం... పీరా! మనిషివి మా పల్లెకే రాకుండా మానుకున్నావు. మూన్నెళ్లకోసారి అయినా వస్తావుండు... బ్బా...” ఎద్దుల్ని గుంజకు కట్టేస్తా పలకరించినాడు అంకిరెడ్డి.

“యాడిదిలే... రెడ్డీ! అప్పటి తీర్న పనులు ఎవరు జేస్తాండారు... భూముల పనంటేనే పారిపోతా వుండారు. ఏ పనైనా జేసుకోను పోతాండారుగానీ వ్యవసాయమంటే ఎవరికి గిడుతా వుండాది...” తన అసంతృప్తిని వెల్లడించినాడు పీరా.

“నిజమేబ్బా, బలవంతంగా ఈ భూముల్ని నమ్ముకొని వుండాంగానీ కొనేటోళ్లు వస్తే అయినకాడికి భూముల్ని అమ్ముకొని టౌనుకు పోవాలనే వుంది...” తన మనసులోని మాటను బయటపెట్టినాడు అంకిరెడ్డి... ఎద్దును పీరా ముందుకు తీసుకొస్తూ.

“రేయ్... మల్లన్న... బిన్నా రా... కొంతసేపు పట్టుకుందువు....” దావెంబడి పోయే వాడిని కేకేసి పిలిచినాడు అంకిరెడ్డి. ఏదో పనిమీద పోతాండే మల్లన్న లోలోపలే తిట్టుకుంటూ తలగోక్కుంటా ఎద్దుకాడికి వచ్చినాడు.

నడుముపై నుంచి తాడేసి ఎడమ రెండు కాళ్లలో ఒకదానికి ఉంగరంలా చుట్టి లాగితే కాలు పైకి లేసి ఎద్దు బరువుతో వెనక్కి వరిగింది. తల దగ్గర మల్లన్న, వెనుక వైపు అంకిరెడ్డి పట్టుకొని వుండగా పడుకున్న ఎద్దు పెనుగులాడతాంది.

“యా... యా... తల పట్టుకోరా మల్లన్న...” కేకేసినాడు అంకిరెడ్డి. మల్లన్న ఎద్దు మెడను గట్టిగా అనిచి పట్టుకున్నాడు.

“ఎద్దులు కొని నాలుగేళ్లు దాటిపోయింది ల్యా... రెడ్డీ,” అంటూ పంగలకర్రను దగ్గరికి తెచ్చి పెట్టుకున్నాడు పీరా.

“ఔ... ఐదేళ్లు అయితా వుంటాదనుకుంటా... రైల్వేగేటును కట్టకాడ మొదలుజేసినప్పుడే కదూ కొనుక్కొచ్చింది...” గుర్తు చేసుకున్నాడు ఎద్దును పట్టుకుంటా అంకిరెడ్డి.

ఎద్దు కళ్లు నల్లనేరేడు పళ్లలాగా మిలమిల మెరుస్తూ నిగనిగలాడ్తా... బెదురు చూపులు చూస్తా వుండాయి. ఉన్నట్టుంది మెడను విదిలించింది.

“బ్బా... ఎద్దు బిసమీద వుంది” అన్నాడు శక్తినంత ఉపయోగించి తలపట్టుకొని మల్లన్న గసపెడ్తా.

“రొంతసేపేలే... గట్టిగా పట్టుకో... పని అయిపోతాది...” ఒక మేకు పెదవుల మధ్య పెట్టుకొని, మరొక మేకు ఒక చేతిలోకి, సుత్తి మరో చేతిలోకి తీసుకున్నాడు పీరా.

“బాగుంది పీరా... నాడాలు తీసుకోకుండనే పనిలోకి దిగినావు...” నవ్వినాడు అంకిరెడ్డి.

“ఔ మర్సిపోయిన. అసల్ది ల్యాకుండా సాంగ్యానికి దిగినట్లుంది. నాడాలు సంచిలోనే పెట్టినా... అన్నీ

కష్టాలే... అన్నీ బాధలే...'' గొణుక్కుంటూ సుత్తి తీసినాడు. నాలుగు నాడాలు పక్కన పెట్టి మిగిలినవి మళ్లీ సంచిలోకే వేశాడు.

కొత్త ఇనుప నాడాలు. కొలిమిలో రగిలి కరిగి తళ తళ మెరుస్తావుండాయి. మర్రిచెట్టు కొమ్మల్లోంచి అప్పుడప్పుడు పడుతున్న సూర్యకాంతిలో వాటి రాజసం వుట్టిపడుతోంది.

జారుతున్న పంచెను ఎగదోపుకుంటూ ఎద్దు కాళ్ల దగ్గరికి పోయి కూర్చున్నాడు పీరా. పంగలకర్రను నాలుగు కాళ్లకు మధ్యన పైకిలేపి నిలబెట్టాడు. ఇప్పుడు గిట్టలు నాడాలు కొట్టడానికి వీలుగా వున్నాయి.

నాడాను తీసుకొని గిట్టకు సరిగ్గా కుదిర్చి మధ్య రంధ్రంలో మేకు వుంచి మొదటి దెబ్బవేశాడు సుత్తితో. ఎద్దు అదిరింది...

మల్లన్న, అంకిరెడ్డి ఇద్దరూ గట్టిగా పట్టుకునే వున్నారు. కాసేపాగి ఎడమ రంధ్రంలో రెండో మేకును వుంచి... రెండో దెబ్బ వేశాడు. ఎద్దు అదిరింది...

పట్టుకున్న ఇద్దరూ ఇంకాస్త పట్టు బిగించారు.

"క్యాదు.... పీరా! ఏంది మనిషివంత తగ్గిపోతా వుండావు. ఏం దిగులు పెట్టుకున్యావు? నీకేం బాధుంది....'' ప్రశ్నించాడు సరదాగానే అంకిరెడ్డి.

మరో మేకు చేతిలోకి తీసుకుంటా "ఏం జెప్పేది రెడ్డో, ముగ్గురు కూతుర్లలో పెద్దమ్మికి మొన్ననే పెండ్లి జేసాను. ఇంగా ఇద్దరు వుండారు. అంతో ఇంతో ఇచ్చి వాళ్లను సాగనంపాల. కొడుకును కువైటకు అంపియ్యాలని ఎప్పట్నుంచో అనుకుంటూనే వుండాను... లెఖ్ఖ యాడ కుదుర్తా వుండాది? దీనెమ్మ ఇదే పాడు బతుకైపోయింది...'' పళ్లు బిగించి మరో దెబ్బ వేశాడు పీరా....

ఎద్దు బుసపెడ్తా అరుపేసింది... విదిలించుకుంటూ.

"కొడుకు ఏం జేస్తావుండాడు...'' మళ్లీ ఇంకో ప్రశ్న వదిలాడు అంకిరెడ్డి.

"వాడేం జేస్తాడు... పదోతరగతి తప్పినాక నాకాడనే కొలిమి పనిలో పెట్టుకొని వుండా... పనికాడికి పర్వాల్యా... బాగనే నేర్సుకున్నాడు... నా ఆశలు, వాళ్లమ్మ కలలన్నీ వాడి మీదనే వుండాయి... ఈసారి పులిందల సంత జరిగినాక అయినా వాడ్ని కువైట్‌కు అంపాలని వుండాను...'' కొడుకు గురించి చెప్తున్నప్పుడు అతడి కళ్లలో కొత్త వెలుగు కన్పించింది.

నాడాలు కొట్టడం వెనుక కాళ్లకు పూర్తయ్యింది. ముందు కాళ్లవైపుకు జరిగినాడు. ఎద్దు గుంజుకుంటా వుంది. వాళ్లు పట్టుకునే వుండారు.

"మాంచి... పదునైన వేట కొడవళ్లు నాలుగు జేసీ పీరా!... ఎలక్షన్లు వస్తాండేటట్లుండాయి.... చేయించి పెట్టుకొని వుంటే ఎట్టైనా అయితాది...'' మీసాలు దువ్వుకుంటా జెప్పినాడు అంకిరెడ్డి.

"అట్నేలే రెడ్డీ... కొలిమికాడ పని నడుస్తానే వుందిలే... ఇప్పుడాదాయం పని అదే వుండాది. అంతో ఇంతో సంపాదించుకుంటా వుండేది ఆ వేట కొడవళ్లు చేసుకునే...!''

"పీరన్న... నాకూ ఒక మచ్చుకత్తి గావాలి...'' అడిగినాడు మల్లన్న పనిలో పనిగా.

"అట్నేలే... మల్ల కొలిమికాడికి రా...'' సమాధానమిచ్చినాడు గిట్టకు మేకు కొడ్తానే.

పని పూర్తయ్యింది. ఎద్దు కాళ్లకు తాడు విప్పగానే అది లేచి కూర్చుని... వెంటనే పైకి లేచి నిలబడింది. అది కొత్తగా అడుగుల శబ్దం చేసుకుంటా వయ్యారంగా నడుచుకుంటూ గుంజ దగ్గరికి చేరుకుంది.

అంకిరెడ్డి రెండవ ఎద్దును కూడా తెచ్చాడు. వచ్చిన ఎద్దు కుదురుగా కూర్చుంది... ఆ తర్వాత మళ్లీ మామూలే... కాళ్లకు కట్టిన తాడు, నాడాలు, మేకులు దెబ్బలు...

అంకిరెడ్డి ఎద్దుల పని కాగానే లెఖ్ఖ సంగతి ప్రస్తావనకు వచ్చింది. మల్లన్న వెళ్లిపోయాడు.

"ఎంతిమ్మంటావు... పీరా...'' బనీను లోపలికి చెయ్యిపెడ్తా అడిగాడు అంకిరెడ్డి.

"ఏముంది... రెడ్డీ... టౌన్లో యాడైనా నాడా కొడితే ఇరవై అయిదు తీసుకుంటా వుండారు. ఇంగ నీకు బుద్ధి పుట్టినంత ఇయ్యి,'' మంచినీళ్ల చెంబు పైకెత్తినాడు.

"ఇరవై అయిదు యాడిస్తావుండార్లే పీరా... పల్లెల్లో అయితే పదైదు... టౌన్లలో అయితే ఇరవై... నువ్వు నాకే జెప్పితే ఎట్టా...'' కళ్లు ఎగరేసినాడు అంకిరెడ్డి.

"అందుకే సామీ అనింది... ఊర్లో పెద్ద రెడ్లు... మీతో పెట్టుకొని మేం యాడ బతికేది. మల్లా ఎప్పుడైనా ఊర్లోకి రావాల్నా... లేదా...'' ఎంతో కొంత ఇయ్యి ముందు అనే ధోరణిలో...

"ఇదో నూరుపెట్టుకో... ఇంగో యాభై వేట కొడవళ్లకు వచ్చినప్పుడిస్తా...'' చేతిలో పెట్టి ఎద్దుల్ని తోలుకొని రోడ్డు దిక్కు కదిల్నాడు.

"నీఅట్టా పనికిమాలినోళ్లు వుండబట్టేకదా వానలు కూడా పడంది...'' అని మనసులోనే తిట్టుకున్నాడు పీరా.

ఒక ఎద్దుకు నాడా కొడితే అరవై రూపాయలిచ్చినా, రెండు ఎద్దులకు నూటా ఇరవై రావాలి. కానీ

నూరు చేతిలో పెట్టి వెనక్కి చూడకుండా వెళ్తున్న అంకి రెడ్డి పైన కోపం పొంగుకొచ్చింది. మాటలు బయటకు రాలేదు కానీ ఏవో తిట్లు అయితే నిశ్శబ్దంగానే తిట్టాడు. ఇంకా నేలను తాకని మర్రి ఊడలు మధ్యలోనే గాలికి ఊగతా వుండాయి... పైన చెట్టుకు.

తర్వాత కొంతసేపటికి నాలుగు జతల ఎద్దులు వచ్చినాయి వీరాపురం కాణ్ణుంచి. సాయంత్రం వరకు వాటికి నాడాలు కొట్టి వచ్చిన లెఖ్ఖ ఎంచుకొని నిక్కరు జేబులోనూ, సామాన్లన్నీ చేతిసంచిలోనూ పెట్టుకొని ఇంటికి బయలుదేరాడు పీరా. దూరంగా రైలు వెళు తున్న శబ్దం...

*

పీరాకు నాడాలు కొట్టే పని తాత మాబూ నేర్పిం చాడు. నగరం నుంచి పండక్కి వూరి కొచ్చినప్పుడు తనని కూర్చోబెట్టుకొని అదేపనిగా చెవిలో పోరు పెట్టేవాడు.

''పెద్ద పనేం లేదు జూడు... కాళ్లు కలిపి తాడుతో గట్టిగా కట్టాలి. రోంత బిగువు తగ్గినా అది కాళ్లు విదిలిస్తే నీ మూతి పళ్లు ఒక్కటుండవు. మట్టసంగా వళ్లు దగ్గర పెట్టుకొని చేయాలి. నాడా గిట్టలకు సరిపోయేలా అమర్చుకోవాలి. కొంత వెనక్కిగానీ, కొంత ముందుకు గానీ పెట్టకూడదు. సరిగ్గా మధ్యలోకి సరిపోవాల. లేకుంటే కాళ్లు ఒకదానికొకటి తట్టుకొని అవి పడిపో తాయి. నాడాలోకి మేకులు సున్నితంగా కొట్టాలి. గట్టిగా తగిలితే అది కట్టు తెంచుకుంటుంది. జాగ్రత్తగా వుండాల... ఏం జెప్పేది అర్థమైతావుండాదా...'' అని నశం పొడి తీసుకొని ముక్కుపుటల్లోకి గట్టిగా పీల్చుకొని అంతే గట్టిగా తుమ్మేవాడు.

తుమ్మడం మొదలైందంటే అది ఆగేది కాదు. ఆ శబ్దమే తుపానులా వుండేది. తుమ్ముతూనే మధ్య మధ్యలోనే అడిగేవాడు... ''నేను జెప్పింది అర్థమైందా...'' అని.

పీరా తలాడించేవాడు.

''నేను నిజాం గుర్రపుశాలలో పని జేస్తావుండాను. వందల్లో వుండాయి అక్కడ గుర్రాలు. అరేబియా నుంచి కూడా తెప్పించుండారు. ఒక్కొక్కటి ఎంత ఎత్తు వుంటాదనుకుంటా వుండావు. తరిఫీదు ఇవ్వడం కూడా వాటికి చాలా కష్టం. నాడాలు కొట్టాలంటే సాధ్యమయ్యే సంగతి కాదు. అవి మాటవిని సావవు. పొరపాటున అవి తంతే మనిషి బతికేది కూడా అసాధ్యం. ఎంత నేర్పుతో, ఓర్పుతో నాడాలు కొట్టేపని చేయాలో తెలుసా... ఏం నేను జెప్పేది అర్థ...?'' అంటూ మళ్లీ నశం ఎక్కించే వాడు. మామూలుగానే తుమ్ములు... ఆగకుండా.

''ఒక్కో గుర్రానికి రెండు నెలలకొకసారి నాడాలు మార్చాలి. అంత త్వరగా అవి అరిగిపోతా వుంటాయి. చేతినిండా పని. నువ్వు ఇక్కడ ముందు పని ఎంతో కొంత నేర్చు కుంటే నేను మా పటేల్‌తో మాట్లాడి కొలువు ఇప్పిస్తా. పని బాగుంటుంది. పనికి తగిన జీతం. ఇక్కడుంటే అదో... ఆ కొలిమి పని జేసుకొని బతకా ల్సిందే. సెగ. బండ చాకిరి... ఏం నేను జెప్పేది అర్థ మైందా...?'' అని గదమాయించే వాడు.

పీరాకు ఆయన మాటలంటే ఒక్కొక్కసారి సరదానే అయినా మరోసారి భయమేసేది. పండక్కి రెండ్రోజుల ముందొచ్చి పనిముట్లన్ని సంచికేసుకొని పల్లెలకు పీరాను పిల్చుకొని పోయేవాడు. ఎద్దులకు నాడాలు కొడ్తా మెలకువలన్నీ నేర్పేవాడు. ఎంతో శ్రద్ధతో, నేర్పుతో, ఓర్పుతో, విసుగు లేకుండా మాబూ పని చేస్తుంటే ఆశ్చర్యమేసేది పీరాకు. సాయంత్రానికంతా పండగ ఖర్చు సంపాదించేవాడు. అందరికీ కొత్తబట్టలు కొని పెట్టేవాడు. పెన్నేట్లోకి తీసుకెళ్లి ఇసుకలో బలిగూడు ఆడించేవాడు. రెడ్డోరివనంలో తేనె పెట్టెలు లేపి తేనె తీసి అందరికి అరచేతులనిండా పోసేవాడు. చెరుకు తోటల కాపలాదారులతో స్నేహం చేసి పెద్ద పెద్ద గెడలు విరిచి అందరికి పంచేవాడు. పిల్లసైన్యమంతా ఎప్పుడూ మాబూ వెనకే తిరుగుతా వుండేది. రకరకాల కథలు చెప్పించుకునేవాళ్లు. ఒక్కొక్క కథ చెప్పాక...

''ఏం నేను జెప్పేది అర్థమైందా?'' అని ఎదురు ప్రశ్నించేవాడు. మళ్లీ తనే అనేవాడు... ''మనం మనిషిలా పుట్టినంక మన తల్లిదండ్రులకు పేరు తేవాల. మన ఊరికి పేరు తేవాల. పదిమందికి సహాయపడాల. చేసే పనిమీద శ్రద్ధ వుండాల. ఓర్పు వుండాల. నేర్పు కావాల. మొగోడు మంచి పని జేసి సంసారాన్ని సాకాల...''

ఆయన మాటల్ని పీరా ఎప్పుడూ మరిచిపోలేదు. తిరిగాడు... మాబూ వెనుక పల్లెలన్నీ తిరిగాడు... నాడాల పనిలోని సందేహాలన్నీ అడిగి తెలుసుకున్నాడు. పనివంతుడై నాడు... కానీ ఒక్కదాన్లో మాత్రం....

తల్లితండ్రుల్ని, భార్యని, వూరిని విడిచి మాబూతో పాటు నగరానికి వెళ్లడానికి అతనికి మనసొప్పలేదు. ఇక్కడే వుండిపోయాడు. తప్పలేదు కొలిమి పని. బతు కాట. నాడాలు కొట్టుకుంటూ పల్లెల్లో తిరగడం. ఇదే జీవితంగా మారింది...

కొడుకు మస్తానుకు కూడా మాబూ చెప్పిన కథ లను చాలాసార్లు కూర్చోబెట్టుకొని చెప్పాడు పీరా. కానీ

వాడిలో ఏ చలనమూ లేదు. నాడాలు కొట్టే పనంటే వాడికిష్టం లేదు. కువైట్ వెళ్లడమే వాడి లక్ష్యం. కొలిమి పని ద్వారా డబ్బు సంపాదించుకొని కువైట్ పోవాలని కష్టపడతా వుండాడు.

కొలిమి పని పుంజుకుంది.

రైతులకు కావలసిన సామాన్లు అన్నీ చెప్పిన సమయానికే అందజేస్తా మస్తాను మంచి పేరు తెచ్చుకుంటా వుండడం.... ఊర్లో ఇంకో కొలిమి పోటీకి లేకపోవడంతో సంపాదన బాగానే వుంటోంది... కొడుకు ఎదగడం పీరాకు సంతోషంగా వుంది. వాడు కువైట్ వెళ్లిపోతే ఇద్దరు కూతుర్లకు కూడా మంచి మంచి సంబంధాలు చూసి పెళ్లి చేయాలని వుంది. అయితే కువైట్‌కు పోను వాడికి చార్జీలు సమకూర్చి పెట్టాల్సి వుంది. అంతా వేల రూపాయలతో పని. వడ్డీకి తీసుకునే పరిస్థితి కూడా లేదు. పెద్దకూతురి పెండ్లికి చేసిన అప్పు ఇంకా తీరనే లేదు. మళ్లీ అప్పు చేయాలంటే కష్టం...

ఆలోచనలు... అనంతంగా...! పల్లె నుంచి కాలి దావన బయలుదేరిన పీరా ఇంటికి చేరుకున్నాడు.

*

రెండ్రోజుల్నుంచి కొలిమి ఆరింది లేదు. ఇద్దరు కూలోళ్లు... మస్తాను కలిసి పనిచేస్తానే వుండారు. నల్ల రాకాసి బొగ్గు రగులుకుంటానే వుంది. పోత ఇనుము వివిధ రూపాల్లో జీవం పోసుకుంటా... పనిముట్టుగా మారతా వుంది.

ఎన్నికల కాలం దగ్గర పడుతుండడంతో కొండాపురం వీరారెడ్డి ఇరవై వేటకొడవళ్లు, ముద్దనూరు నర్సింహారెడ్డి పది వేట కొడవళ్లు, యర్రగుంట్ల పాపిరెడ్డి, సిద్ధినాయుడు చెరో పన్నెండు వేట కొడవళ్లు కావాలని ముందుగానే చెప్పడంతో పని వేగం పుంజుకుంది.

కొలిమిలో వెలుగు కన్పిస్తున్న కొద్దీ పీరా కళ్లలో కాంతులు విరజిమ్ముతుండాయి. కలలు... కూతుళ్లకు ఘనంగా పెండ్లి చేసినట్లు, కొడుకు రెక్కల విమానం ఎక్కి కువైట్ దేశం పోయి దీనార్ల వర్షం కురిపిస్తా వున్నట్టు... వూర్లో తాము ఒక మాదిరిగా బతకడానికి మిద్దె వేసుకొని, సొంత బోరు వేసుకొని.... బీబీకి చెవుల్లోకి మెడలోకి నాల్గు నగలు చేయించుకొని గౌరవంగా జీవిస్తున్నట్లు... కలలు... కలలు... నడిరాత్రి ఉలిక్కిపడి నిద్ర మేల్కొ న్నాడు పీరా. ఔ... తాను పులిందలకి బయలుదేరాల్సింది ఈరోజే. సంత... ఎద్దుల సంత... మూడు జిల్లాల నుండి వందల ఎద్దులు అక్కడికి అమ్మకానికి వస్తాయి. ఇప్పుడు బయలుదేరితేకాని.... అందుకోలేడు. మస్తాను కొలిమి పనిలో వుండాడు కాబట్టి తన తమ్ముడి కొడుకు కరీంగాడ్ని వెంటబెట్టుకొని బయలుదేరినాడు... చీకట్లోనే.... చేతి సంచి తీసుకొని!

*

జనం... జనం... ఎక్కడ చూసినా జనం... పల్లెల్నుంచి బండ్లు కట్టుకొని వచ్చినారు. పులిందల ఎద్దుల సంతంటే ఆషామాషీ కాదు. రాయలసీమలోనే పెద్ద సంత. అదృష్టంకొద్దీ మర్రిచెట్టు కిందే చోటు లభించింది. నేల దిగని ఊడలు గాలికి అటూ ఇటూ ఊగుతా వుండాయి.

చెట్టు కింద శుభ్రం చేసుకొని కూర్చున్నాడు. పనిముట్లను చక్కగా ముందేసుకొని చూస్తున్నాడు. వచ్చినాయి... ఎవరివో ఎద్దులు...

ఎదురుగా వచ్చి కుదురుగా కూర్చుంటున్నాయి... కాళ్లు తాడుతో కట్టడం... పంగలకర్రను ఆసరాగా చేసుకొని ఎత్తడం... నాడాలు కొట్టడం... డబ్బులు... ఒక్కో నాడా కొడితే ఇరవై అయిదు రూపాయలు. మొదలయ్యింది...

ఎద్దులు వస్తానే వుండాయి. నాడాలు దిగుతానే వుండాయి గిట్టల్లోకి. దుమ్ము... బేరం ఆడుతున్న వారి కేకలు... ఎండ... నాడాలు కొడుతుంటే పుడుతున్న శబ్దం చెవుల్లో మార్మోగుతూనే వుంది.

చమటలు శరీరాన్ని తడిపేస్తున్నాయి. డబ్బులు జేబులోకి చేరుతున్నకొద్దీ పని పైన వ్యామోహం... కసి...

కొలిమి నేర్పిన రహస్యం.... వేడిలోనే వంచుకోవాలి! పని చిక్కినప్పుడే సంపాదించుకోవాలి. ఆకలి చచ్చిపోయింది. నాడాలు టకటక శబ్దం చేసుకంటూ దిగిపోతున్నాయి. ఎద్దులు కదిలిపోతున్నాయి. మధ్యాహ్నమైంది.

కరీంకు ఓ పది నోటిచ్చి 'ఏమైనా తిని రమ్మని' పంపించాడు... నాడాలు తగ్గి పోతున్నాయి. 'ఇంకొన్ని తెచ్చివుంటే బాగుండేది... ఇప్పుడెవ్వరూ బదులివ్వరు,' మనసులోనే అనుకున్నాడు.

తానైతే మాత్రం వ్యాపారం జరిగేచోట ఎందుకిస్తాడు... అందరూ అంతే... చాలు... దేవుడు ఇచ్చిన కాడికి... ఏవేవో ఆలోచనలు!

చేతులు నిరంతరంగా నాడాలు కొడుతూనే వున్నాయి. మధ్యమధ్యలో మంచినీళ్లే ఆహారం. కరీం ఏదో తినివచ్చి నిమ్మళంగా కాసేపు చెట్టునీడలో కూర్చుండిపోయాడు. పని నడుస్తానే వుంది. చేతివేళ్లు పట్టుకపోతూ వుండడంతో సుత్తి క్రింద పెట్టి కాసేపు

పిడికిలి బిగించి నేలకేసి చిన్నగా కొట్టాడు. కొంత తిమ్మిరి తగ్గింది. నిమ్మళంగా వుంది. సాయంత్రం కావస్తోంది. ఇంకో అరగంట కష్టపడితే సరిపోతుంది. సంచి విదిలించి చూశాడు. నాడాలు కొన్నే వున్నాయి. ఇంకో జత ఎద్దులకంటే సరిపోవు.

వేకువనే ఆహారం వేటకెళ్లిన పక్షుల గుంపులు వింత వింత అరుపులతో మర్రి చెట్టు కొమ్మలపైకి చేరుకుంటున్నాయి. ఎద్దుల్ని కొనుక్కున్న రైతులు ఇళ్ల దారి పట్టారు. చివరి నాడా... చిట్టచివరి నాడా...

ఇది ఒక్కటి కొడితే యిక ఈరోజుకు తన పని పూర్తవుతుంది. కాసేపు ప్రశాంతంగా కూర్చొని డబ్బు లెక్కపెట్టుకోవాలని పీరాకు ఆరాటంగా వుంది.

చివరి నాడాలోకి మేకులు దిగుతుంటే ఇద్దరు వ్యక్తులు మోటారుబైక్ పైన అక్కడి కొచ్చారు. వాళ్లను చూస్తే చాలాసేపటికి నుంచి పీరా గురించి వెతుకుతున్న వాళ్లలాగా ఎర్రటి దుమ్ము కొట్టుకొని పోయి కన్పిస్తున్నారు...

"నువ్వేనా... పీరా!" ప్రశ్నించారు వాళ్లు.

"ఔ... నేనే..." గిట్టలోకి మేకు దిగింది.

"మస్తాను... నీ కొడుకేనా" మళ్లీ ప్రశ్న.

"ఔ... నా బిడ్డే..." ఇంకో మేకు అందుకున్నాడు.

"క్యాదు... పెద్దాయన! పిల్లల్ని సాకను రాదా నీకు... కొలిమి పని వాడికి నేర్పినావు. బాగానే వుంది. వేట కొడవళ్లు తయారుచేస్తా వుంటే కేసు అయితాదని వానికి చెప్పాల్నా... లేదా? ముచ్చు మర్రికాడ మొన్న జరిగిన ఫ్యాక్షన్ హత్యలో దొరికిన ఆయుధాలన్నీ మీ వాడే తయారుచేసి ఇచ్చినాడని తేలింది. రైలు పట్టాల కేసే ఇనుప పలకలు దొంగతనంగా తీసుకపోయి కొలిమిలో సామాన్లు చేసుకుంటా వుంటే తిట్టి దార్లో పెట్టాలని తెలీదా? ఇంటి దగ్గరికి పోతే వాడు పరారీలో వుండాడని తెల్సింది. పా... స్టేషన్‌కు పోదాం..." అరిచినాడు ఎత్తుటి మనిషి.

చివరి మేకు కొట్టినాడు పీరా.

కానీ అది ఎద్దు గిట్టలో దిగలేదు. మేకును అదిమి పట్టుకున్న ఎడమ చేతి బొటన వేలు మధ్యలో దిగింది. నెత్తురు చిమ్మింది. కేక... చావుకేక.... ఆకాశానికి ఎగిసింది. ఇన్నేళ్ల తన వృత్తిలో ఏ రోజూ వేటు తప్పింది లేదు. పైకి చూశాడు... మర్రిచెట్టు ఊడ... నేలకు దిగి చెట్టుకు ఆసరాగా నిలవాల్సిన ఊడ... మధ్యలోనే ఎండిపోతా కనిపించింది.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 15 ఏప్రిల్ 2007*

